# రోడ్డుపై తవ్వకాలు నిలిపివేత

- కాంట్రాక్టర్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

నమస్తే ఎఫెక్ట్

నవాబ్‌పేట, జూన్ 9: నవాబ్‌పేట మండల కేంద్రం నుంచి జిల్లాకేంద్రం వరకు ప్రధాన రోడ్డు పక్కన నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న ఎయిర్‌టెల్ 5జీ కేబుల్ పనులను ఆర్‌అండ్‌బీ అధికారులు ఆదివారం నిలిపివేశారు. నమస్తే తెలంగాణ దినపత్రికలో 'ఇష్టారీతిగా తవ్వకాలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. డీఈఈ సంధ్య, ఏఈఈ ప్రశాంత్ ఆదివారం కాంట్రాక్టర్‌పై నవాబ్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎస్సై అభిషేక్‌రెడ్డి, తమ సిబ్బందిని పనివద్దకు పంపి కేబుల్ పనులను నిలిపివేయించారు. రోడ్డును ధ్వంసం చేయించిన కాంట్రాక్టర్‌కు రోడ్లు, భవనాల శాఖ నిబంధనల మేరకు జరిమానా విధిస్తామని డీఈఈ సంధ్య, ఏఈఈ ప్రశాంత్ వివరించారు.

# బాధిత కుటుంబానికి ఆల పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

దేవరకద్ర, జూన్ 9 : మండలంలోని కోయిల్‌సాగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త లక్ష్మన్న కుమారుడు రాహుల్ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదివారం గ్రామానికి వెళ్లి రాహుల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆల వెంట సహకార సంఘం అధ్యక్షుడు డోకూర్ నరేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, తిమ్మన, బాలకృష్ణ ఉన్నారు.

# పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



హన్వాడ : కేక్ కట్ చేస్తున్న పూర్వ విద్యార్థులు

హన్వాడ, జూన్ 9: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మోడల్ బేసిక్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి 1986–87 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం జిల్లా కేంద్రంలోని మయూరి నర్సరీలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

***కోస్గిలో..***

కోస్గి, జూన్ 9 : కోస్గి పట్టణంలోని ఏబీకే ఫంక్షన్ హాల్‌లో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 2003–04 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల ఆతీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు.



కోస్గి : సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

## విద్యార్థులకు నోట్‌బుక్కులు పంపిణీ

నవాబ్‌పేట, జూన్ 9: మండలంలోని శ్యామగడ్డతండాకు చెందిన యువకులు నరేందర్‌నాయక్, దశరథ్‌నాయక్ విద్యార్థులకు తమ సొంత నిధులతో నోట్‌బుక్కులు అందజేశారు. తండాలో గల నిరుపేద విద్యార్థులకు అందజేసి మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సేవాలాల్ యువజన సంఘం సభ్యులు గోపీనాథ్, హీర్యా, రెడ్యానాయక్, గోపాల్‌నాయక్, లక్ష్మణ్, రాములు, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## జేఈఈ ఫలితాల్లో వాగ్దేవి విద్యార్థుల జయకేతనం



అన్విత



శివ



సాయిభరత్

పాలమూరు, జూన్ 9: ఐఐటీలో, బీటెక్ సీట్ల భర్తీకి గతనెల 26న నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని వాగ్దేవి ఐఐటీ అకాడమీకి చెందిన విద్యార్థులు వివిధ కేటగిరీలలో ఆల్ ఇండియా ర్యాంకులు సాధించారు. అందులో అన్విత ఆల్ ఇండియా 723వ ర్యాంకు, సాయిభరత్ 1,140వ ర్యాంకు, శివ 2,686వ ర్యాంకు సాధించారని కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి, అకాడమీ ఇన్‌చార్జ్ పావనిరెడ్డి తెలిపారు. సాధారణ విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించడం సంతోషంగా ఉందన్నారు.

## జేఈఈలో అక్షర విద్యార్థుల విజయభేరి



వై.శ్రీజ

పాలమూరు, జూన్ 9: జిల్లా కేంద్రంలోని అక్షర జూనియర్ కళాశాల ఐఐటీ/నీట్ అకాడమికి చెందిన విద్యార్థిని శ్రీజ జేఈఈ ఫలితాలలో ఆల్ ఇండియా కేటగిరిలో 2055వ ర్యాంకు సాధించిందని కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక బృందం, యాజమాన్యం సంతోషం వ్యక్తం చేశారు. పటిష్టమైన ప్రణాళికతో జిల్లా విద్యార్థులను ఉత్తమ ర్యాంకర్‌లుగా తీర్చిదిద్దుతామని ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ తెలిపారు.

## ఆటో యూనియన్ పట్టణ కార్యవర్గం ఎన్నిక

జడ్చర్లటౌన్, జూన్ 9: ఆటో యూనియన్ జడ్చర్లపట్టణ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జడ్చర్లలోని చంద్రాగార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో ఆటో యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజగాని అశోక్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇప్పటికే పట్టణ అధ్యక్షుడిగా షేక్‌హాజీ ఎంపిక కాగా, నూతన ఉపాధ్యక్షుడిగా మధు, ప్రధాన కార్యదర్శి కొంగళి వెంకట్, కార్యదర్శులుగా బాబర్, హైమద్‌అలీ, కార్యవర్గసభ్యులు మహేశ్, సలీం, ఇనాయత్, సలహాదారులుగా రాములు, ఖదీర్ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను ఆటోడ్రైవర్లు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



దేవరకద్ర మండలం గోపన్‌పల్లిలో విత్తనాలు విత్తుతున్న రైతులు

- జోరుగా కురుస్తున్న వర్షాలు
- వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు
- ఎరువులు, విత్తనాల దుకాణాలు కిటకిట

# సంబురంగా సాగు



జడ్చర్ల మండలం కోడ్గల్ శివారులో విత్తనాలు విత్తుతున్న కూలీలు

జడ్చర్ల, జూన్ 9 : ఇటీవల జోరుగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు సంబురంగా సాగుకు సన్నద్ధమవుతున్నారు. మెట్ట పొలాల్లో విత్తనాలను విత్తుకుంటున్నారు. వానకాలం తొలకరి ముందుగానే పలకరించడంతో వర్షాలు మృగశిరకార్తెకు ముందుగానే పడ్డాయి. వర్షాలు పుష్కలంగా కురుస్తుండటంతో జొన్న, మొక్కజొన్న, పత్తి, కంది, తదితర విత్తనాలను విత్తుతున్నారు. గతేడాది వర్షాలు మురిపించి మరిపించడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురుస్తుండడంతో సంబురంగా సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. మండలంలో పత్తిసాగు అధికంగా సాగయ్యే అవకాశం ఉన్నది. కాగా, సాగు సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. కొందరు రైతులు కలుపుమందును నీటిలో కలిపి పిచికారి చేయకుండా, యూరియాలో కలిపి చల్లుతున్నారన్నారు. యూరియాలో కలుపుమందు కలిపి చల్లడం వల్ల పంటకు ఎలాంటి ప్రయోజనం ఉండదని మండల వ్యవసాయశాఖ అధికారి గోపినాథ్ తెలిపారు. ఆర్‌ఎన్‌ఆర్ వరిని సాగుచేసే రైతులు జూన్ 23 నుంచి జూలై 20వ తేదీ వరకు మాత్రమే వరినార్లు పోసుకోవాలని తెలిపారు. ముందుగా నారు పోయడం వల్ల దిగుబడులు తగ్గే అవకాశం ఉంటుందని సూచించారు. సోనా రకాలను మాత్రం ముందుగానే వరినార్లు పోసుకోవడానికి అవకాశం ఉందన్నారు.

### పొలాల్లో కోలాహలం..

దేవరద్ర, జూన్ 9 : గతేడాది ముందుగా మురిపించి జాడ లేకుండా పోవడంతో పంటలు చేతికి రాక ఎంతో మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురువడంతో సాగు పనులను సంబురంగా ప్రారంభించారు. దేవరకద్ర మండలంలోని గోపన్‌పల్లి, గుడిబండ, డోకూర్, మినుగోనిపల్లి, జీన్గురాల తదితర గ్రామాల్లో రైతులు పత్తి విత్తనాలు నాటుతున్నారు. విత్తనాలు నాటే పనిలో బీజీగా మారారు. కాగా, కేసీఆర్ సర్కారు వానకాలం ఆరంభంలోనే రైతులకు పెట్టుబడి సాయం అందించి అండగా నిలువగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వారు ప్రకటించిన రైతుభరోసా ఇప్పటి వరకు ఊసే లేదు. దీంతో చాలా మంది రైతులు ప్రైవేటు వ్యక్తుల వద్ద వడ్డీకి అప్పులు తెచ్చుకొని సాగు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది.



మూసాపేటలో విత్తనాలు వేసేందుకు సిద్ధం చేసిన పొలం

### పంటమార్పిడితోనే అధిక దిగుబడి..

మూసాపేట, జూన్ 9 : పంటమార్పిడితోనే అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. మూసపద్ధతిలో సాగు చేయడం వల్ల భూసారం దెబ్బతిని ఆశించిన స్థాయిలో దిగుబడులు రావని వ్యవసాయాధికాలు సూచిస్తున్నారు. కేసీఆర్ సర్కారులో రైతులను చైతన్యం చేసేందుకు ఆయిల్‌పాం పంటల సాగును ప్రోత్సహించారు. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆయిల్‌పాం తోటల వైపు అడుగులు వేశారు. మరింత మంది రైతులు పంట మార్పిడికి మొగ్గు చూపే అవకాశం ఉంటుంది.

### యూరియాలో కలుపుమందు కలిపి వాడొద్దు

జడ్చర్ల, జూన్ 9: వానకాలంలో విత్తనాలు విత్తాక, కలుపు నివారణ కోసం చల్లే కలుపునివారణ మందులను నీటిలో కలిపి పిచికారీ చేయాలని జడ్చర్ల మండల వ్యవసాయశాఖ అధికారి గోపినాథ్ సూచించారు. యూరియాలో కలిపి చల్లడం వల్ల ప్రయోజనం ఉండదని చెప్పారు. అదేవిధంగా ఆర్‌ఎన్‌ఆర్ వరిని సాగుచేసే రైతులు జూన్ 23నుంచి జూలై 20వరకు మాత్రమే వరినార్లు పోసుకోవాలని తెలిపారు. దీర్ఘకాలిక రకాలైన సోనారకాలను మాత్రం ముందుగానే వరినార్లు పోసుకోవడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు.

### సద్వినియోగం చేసుకోవాలి

నారాయణపేట, జూన్ 9: పట్టణ ప్రజలు వైకుంఠ రథాన్ని సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ హరినారాయణ భట్టడ్ అన్నారు. లయన్స్ క్లబ్, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ హరినారాయణ భట్టడ్ ఆర్థిక సహకారంతో రూ.8లక్షలతో ఏర్పాటు చేసిన వైకుంఠ రథాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలకు వైకుంఠరథం ద్వారా ఉచిత సేవలు అందిస్తామన్నారు. అవసరమైన వారు సెల్ నెంబర్ 99852 21859, 91773 77329 ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెంకటయ్య, జనార్దన్, సాయినాథ్, భీంచందర్ గౌడ్ పాల్గొన్నారు.

### మఠం అభివృద్ధికి కృషి చేస్తా

నారాయణపేట టౌన్, జూన్ 9: సద్గురు అవధూత నరసింహస్వామి మఠం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని మఠం కమిటీ నూతన అధ్యక్షుడు జయప్రకాశ్ అన్నారు. ఆదివారం అవధూత నరసింహస్వామి మఠం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జయప్రకాశ్, ఉపాధ్యక్షులుగా రామకృష్ణ కళ్యాణి, ప్రధాన కార్యదర్శిగా బాల్‌చందర్, సహాయ కార్యదర్శిగా కిరణ్, కోశాధికారిగా అమిత్‌కళ్యాణితో పాటు మరో 25 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

# కొనసాగుతున్న బడిబాట



హెచ్‌ఎంలకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఏఎంవో

నారాయణపేటరూరల్, జూన్ 9: పేట మండల పరిధిలోని లక్ష్మీపూర్, భైరంకొండ, సింగారం, చిన్నజట్రం, బసిరెడ్డిపల్లి, తిర్మలాపూర్, శేర్నపల్లి, జాజాపూర్, బోయిన్‌పల్లితో పాటు తదితర గ్రామాల్లో ఆదివారం బడిబాట కార్యక్రమం కొనసాగింది. ప్రభుత్వ పాఠశాల ల్లో ప్రస్తుతం ఇంగ్లిష్ మీడియం బోధన చేస్తున్నారని చెప్పారు. లక్ష్మీపూర్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం జనార్దన్‌రెడ్డితో పాటు అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, పూర్వవిద్యార్థులు పెద్దఎత్తున పాల్గొని ఇంటింటికీ తిరిగి బడిబాట ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం సహపంక్తి అల్పాహారం చేశారు. కార్యక్రమంలో అమ్మ ఒడి చైర్మన్లు, హెచ్‌ఎంలు జనార్దన్‌రెడ్డి, కనకప్ప, కృష్ణారెడ్డి, జనార్దన్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

***మూసాపేట, అడ్డాకుల మండలాల్లో..***

మూసాపేట, జూన్ 9 : మూసాపేట మండలంతో పాటు, అడ్డాకుల మండలంలోని పలు గ్రామాల్లో బడిబా ట కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. మూసాపేట మండలంలో ఎంఈవో రాజేశ్వర్‌రెడ్డి పలు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని త ల్లిదండ్రులను కోరారు.

***పాఠ్య పుస్తకాల పంపిణీ..***

భూత్పూర్, జూన్ 9 : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను ఏఎంవో దుంకుడు శ్రీనివాస్ అందజేశారు. ఆదివారం బడిబాటలో భాగంగా స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో హెచ్‌ఎంలకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రభుత్వమే ఉచితంగా పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజన సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో నాగయ్య, సీఆర్పీ ఇక్రామ్, హెచ్‌ఎం యాదయ్య, వహీద్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీని పునరుద్ధరించాలి



డ్రైనేజీని పరిశీలిస్తున్న చైర్మన్ ఆనంద్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 9 : డ్రైనేజీని పునరుద్ధరించాలని పట్టణంలోని 35వ వార్డు నూర్‌నగర్ కాలనీ ప్రజలు మున్సిపల్ చైర్మన్‌ను కోరారు. మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు డ్రైనేజీలు పూర్తిగా ముసుకుపోయాయని, కాలనీలోకి వరద నీరు చేరి దుర్గంధంగా మారిందని తెలిపారు. ఈ మేరకు ఆదివారం వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్,కౌన్సిలర్ నర్సింహులుతో కలిసి చైర్మన్ ఆనంద్‌గౌడ్ నూర్‌నగర్ కాలనీ సందర్శించారు. త్వరలోనే పునరుద్ధరణ పనులు చేపటి నీటిని తొలిగిస్తామని తెలిపారు.

# గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతం

- పర్యవేక్షించిన కలెక్టర్ రవినాయక్, అదనపు ఎస్పీ రాములు
- ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను అనుమతించని అధికారులు



పరీక్షా కేంద్రంలోకి వెళ్లేందుకు క్యూలో నిల్చున్న అభ్యర్థులు



మహబూబ్‌నగర్/పాలమూరు, జూన్ 9: మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఆదివారం గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షను 36 పరీక్షా కేంద్రాలలో నిర్వహించారు. అభ్యర్థులు అరగంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని తెలిపినా,కొందరు ఆయా పరీక్ష కేంద్రాలకు ఆలస్యంగా రావడంతో అధికారులు వారిని అనుమతించలేదు. జిల్లా కేంద్రంలోని ఎస్వీఎస్ మెడికల్ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ రవినాయక్ పర్యవేక్షించారు. అదేవిధంగా జయప్రకాశ్ నారాయణ్ ఇంజినీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థుల తనిఖీని ఏఎస్పీ రాములు పర్యవేక్షించారు. ఈ పరీక్షకు 15,199 మందికి గానూ 12,176 మంది హాజరయ్యారు. 3,023మంది గైర్హాజరయ్యారు. చీఫ్ సూపరింటెండెంట్లు, పర్యవేక్షణ అధికారులు తనిఖీ నిర్వహించారు.



హాల్ టికెట్ సరిచూసుకుంటున్న అభ్యర్థులు





చిన్నారిని బంధువుకు ఇచ్చి పరీక్షకు వెళ్తున్న అభ్యర్థి, పరీక్షకు వేగంగా వస్తున్న అభ్యర్థులు

### 11, 12తేదీల్లో జెడ్పీస్థాయి సంఘాల భేటీ

పాలమూరు, జూన్ 9: మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ పరిధిలోని ఏడు స్థాయి సంఘాల సమావేశాలు ఈనెల 11, 12వ తేదీల్లో జెడ్పీ చైర్ పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు జెడ్పీ కార్యాలయ కార్య నిర్వహణ అధికారి రాఘవేంద్రరావు తెలిపారు. ఈనెల 11న ఉదయం 10:30 నిమిషాలకు గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, స్థాయి సంఘాల సమావేశాలుంటాయని, మధ్యాహ్నం 2గంటలకు విద్య, వైద్య సేవలు, స్త్రీ శిశుసంక్షేమం స్థాయి సంఘాల భేటీ ఉంటుందని పేర్కొన్నారు. 12న ఉదయం 10:30గంటలకు నిర్మాణ పనులు, సాంఘిక సంక్షేమం, మధ్యాహ్నం 2గంటలకు ప్రణాళిక స్థాయీ సంఘ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు.

### క్రీడలతో మానసికోల్లాసం

నవాబ్‌పేట, జూన్ 9: క్రీడలతో మానసికోల్లాసం, శారీరక ధృఢత్వం ఏర్పడుతుందని కారుకొండ గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు దశరథ్‌నాయక్ పేర్కొన్నారు. మండలంలోని కారుకొండ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నెలపాటు నిర్వహించిన వేసవి క్రీడాశిక్షణా శిబిరం ఆదివారం ముగిసింది. పాఠశాల ఆవరణలో నిర్వహించిన శిబిరం ముగింపు కార్యక్రమానికి జీహెచ్‌ఎం హాజరై మాట్లాడారు. నెలపాటు వివిధ క్రీడల్లో శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కారుకొండ గ్రామానికి చెందిన పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ చంద్రకుమార్ తన ఉదారభావంతో క్రీడా శిక్షకుడు సాయికుమార్‌కు రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు.

### ఎస్సీ వర్గీకరణ లక్ష్యంగా పనిచేస్తాం

మహబూబ్‌నగర్, జూన్ 9: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ వర్గీకరణ లక్ష్యంగా పనిచేస్తామని తెలంగాణ రాష్ట్ర మాదిగ సంఘాల మహాకూటమి అధ్యక్షుడు కిరణ్ మాదిగ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో మహా కూటమి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల మాదిగ సంఘాల నేతలతో సమీక్ష నిర్వహించారు.

### భర్త మందలించాడని భార్య ఆత్మహత్య

జడ్చర్లటౌన్, జూన్ 9: పిల్లలకు పరీక్ష ఫలితాల్లో మార్కులు ఎందుకు తక్కువగా వచ్చాయని భర్త మందలించడంతో మనస్తాపంతో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ప్రీతియాదవ్(34) ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన జడ్చర్లలో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మెజ్రా గ్రామానికి చెందిన రామ్ అశీష్‌యాదవ్ కొంతకాలంగా పట్టణంలోని రంగారావుతోట ప్రాంతంలో అద్దెకు ఉంటున్నాడు. పోలేపల్లి సెజ్ మైలాన్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇతని భార్య ప్రీతియాదవ్, ఇద్దరు పిల్లలు స్వగ్రామంలోనే నివసిస్తున్నారు. వేసవిసెలవుల నేపథ్యంలో భార్య ప్రీతియాదవ్ జడ్చర్లకు వచ్చి భర్త వద్ద ఉంటుంది. ఈ క్రమంలో రెండు రోజుల కిందట ఇద్దరు పిల్లల చదువుల రిజల్ట్స్‌లో తక్కువ మార్కులు రావటంపై భర్త రామ్ అశీష్‌యాదవ్, భార్య ప్రీతియాదవ్‌ను మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైంది. భర్త శనివారం రాత్రి డ్యూటీకి వెళ్లి, తిరిగి వచ్చేలోగా ఇంట్లో ఫ్యానుకు చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై భర్త ఆశీష్‌యాదవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం జడ్చర్ల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

### జడ్చర్ల వాసికి ఛత్రపతి శివాజీ సేవారత్న అవార్డు

జడ్చర్లటౌన్, జూన్9 : జడ్చర్లలోని సంస్కారభారతి సభ్యుడు గోనెల రాధాకృష్ణ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలకు గాను ఛత్రపతి శివాజీ సేవారత్న అవార్డు లభించింది. శ్రీకరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యాంసుందర్, డాక్టర్ అభిలాశ్, మౌనికరెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, ముత్యంస్వామి చేతులమీదుగా అవార్డును అందుకున్నట్లు గోనెల రాధాకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా సంస్కారభారతి సభ్యులు, కళాకారులు అభినందించారు.

***మూసాపేట వాసికి ఉత్తమ అవార్డు***

మూసాపేట, జూన్ 9 : మూసాపేటకు చెందిన విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ బాలయ్యకు ఆదివారం హైదరాబాద్‌లో రవీంద్రభారతిలో ఉత్తమ సామాజిక ఆధ్యాత్మిక సేవావేత్తగా గుర్తించి అవార్డును అందజేశారు. ఆయన చేసిన పలు సేవా కార్యక్రమాలకు గానూ జీసీఎస్ వల్లూరి సంస్థ వారు నేషనల్ బంగారు నంది అవార్డుకు ఎంపిక చేసి అందజేశారు.

### ఉష సౌత్ జోన్ పోటీలకు మక్తల్ విద్యార్థులు

మక్తల్ జూన్ 9: ఖేలో ఇండియా ఉమెన్స్ ఉష సౌత్‌జోన్ పోటీలకు మక్తల్ డ్రాగన్ కరాటే స్పోర్ట్స్ క్లబ్ విద్యార్థులు వెళ్లారని డ్రాగన్ ఛోటే క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు సాలంబిన్ ఉమర్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జూన్ 10నుంచి 13వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రం బాగల్‌కోట్‌లో జరిగే సౌత్‌జోన్ ఖేలో ఇండియా అండర్–16లో 50కేజీ, అండర్–14 ఇయర్స్ 35కేజీల విభాగంలో హరిప్రియ, అండర్–11, 30కేజీ విభాగంలో హసిని వెళ్లారని తెలిపారు. వారిని ఘనంగా సత్కరించినట్లు తెలిపారు. 09 ఎం కే ఎల్ 22; సౌత్‌జోన్ క్రీడలకు వెళ్తున్న విద్యార్థినిని సత్కరిస్తున్న దృశ్యం